
సాంకేతిక హబ్.. ట్యాబ్

- ఫలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నం
- పాఠ్యాంశాలపై పూర్తి పట్టు సాధిస్తున్న విద్యార్థులు
- బైజ్యూస్ కంటెంట్‌తో విజ్ఞాన వికాసం
- రివిజన్‌తో అధిక మార్కుల సాధనకు దోహదం
- ఆప్షనల్ ప్రశ్నల ప్రాక్టీస్‌తో సబ్జెక్ట్‌పై పూర్తి అవగాహన


ట్యాబ్‌లను ఉపయోగించుకుంటున్న 8వ తరగతి విద్యార్థులు


ట్యాబ్‌లో ఇన్‌స్టాల్ చేసిన వివిధ పాఠ్యాంశాల యాప్‌లు

తెనాలిఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లు ఎంతో ఉపయుక్తమయ్యాయి. ప్రతి పాఠ్యాంశంపై ఆన్‌లైన్‌లో నిర్వహించే క్విజ్ పోటీల్లో పాల్గొని, సాంకేతికతను విద్యార్థులు అందిపుచ్చుకుంటున్నారు. పాఠశాల దశలోనే సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను రెండేళ్ల నుంచి పంపిణీ చేస్తోంది. ట్యాబ్‌లలో మ్యాథమాటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, హిస్టరీ, జియోగ్రఫీ, సివిక్స్, ఎకనామిక్స్, కాంపిటేటివ్ ఎగ్జామ్స్, ప్రీవియస్ ఇయర్ పేపర్ వంటి యాప్స్‌ను దానిలో పొందుపరిచారు.

పాఠ్యాంశాలపై పట్టు..

విద్యార్థులు ఆయా సబ్జెక్టులకు సంబంధించి ఉపాధ్యాయులు పాఠాలు బోధించిన తర్వాత వాటికి సంబంధించిన వీడియోల వీక్షణ ద్వారా పాఠ్యాంశంపై మరింత పట్టు సాధిస్తున్నారు. అంతేకాకుండా ప్రతి పాఠానికి సంబంధించిన బిట్స్‌ను పూర్తి చేస్తున్నారు. అనంతరం వాటిని సబ్‌మిట్ చేయగానే తప్పొప్పులు అక్కడే తెలుసుకునే అవకాశం ఉంటుంది. దీంతో విద్యార్థులు ప్రతి పాఠ్యాంశంపై పట్టుసాధించేందుకు ట్యాబ్‌లు దోహదపడుతున్నాయి. అంతేకాకుండా కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు సంబంధించిన విజ్ఞానాన్ని ట్యాబ్‌లో పొందగలుగుతున్నారు. అలాగే గతేడాది పరీక్ష పేపర్‌లను దానిలో పొందుపరచటం వల్ల ప్రాక్టీస్ చేయడానికి అవి ఉపయోగపడుతున్నాయి.

అప్‌డేట్ అయిన ట్యాబ్‌లు..

గతేడాది ఎనిమిదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ట్యాబ్‌లు పంపిణీ చేసింది. తొమ్మిదో తరగతిలో ఉన్న వారికి ట్యాబ్‌లు మరింత ఉపయోగపడేలా ప్రభుత్వం వాటిని అప్‌గ్రేడ్ చేసింది. వాటిలో తొమ్మిదో తరగతి పాఠ్యంశాలను ఆటోమెటిక్‌గా అప్‌డేట్ అయ్యే విధంగా చర్యలు తీసుకుంది

3,019 మంది విద్యార్థులకు..

రాష్ట్ర ప్రభుత్వం గతేడాది తెనాలిలో ఉన్న 19 మున్సిపల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న 1,597 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసింది. ఈ ఏడాది 1,422 మందికి ట్యాబ్‌లు అందజేసింది. మొత్తం 3,019 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందుకున్నారు. వాటిని ఉపయోగించుకుంటూ మంచి మార్కుల సాధిస్తున్నారు. దీనికితోడు చిన్న వయస్సు నుంచే సాంకేతికను అందిపుచ్చుకుంటున్నామనే ఆనందాన్ని విద్యార్థులు వ్యక్తం చేస్తున్నారు.

రివిజన్ చేయడానికి..



ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను మరొకసారి రివిజన్ చేసుకోవడానికి ట్యాబ్‌ల్లోని కంటెంట్ ఉపయోగపడుతోంది. దీంతో పాఠాలను మరింత అర్థం చేసుకోవాడానికి వీలవుతోంది.

– ఎం.తరుణ్‌కుమార్, 9వ తరగతి, తెనాలి

మార్కులు సాధించడానికి..



ట్యాబ్‌ల్లోని కంటెంట్ ప్రతి పాఠ్యాంశానికి సంబంధించిన బిట్స్ డిస్‌ప్లే అవుతున్నాయి. వాటిని ఉపయోగించుకోవడం వల్ల ఎక్కు మార్కులు సాధిస్తున్నాం. తప్పు ఆన్సర్ ఇస్తే.. కరెక్ట్ చేస్తుంది. దీని వల్ల తప్పులు తెలుసుకోగలుగుతున్నాం.

– షేక్ దిల్‌షా, 9వ తరగతి, తెనాలి

టెక్నాలజీ ఉపయోగం



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నాలాంటి పేద విద్యార్థులకు ట్యాబ్‌లు ఎంతో ఉపయోగం. బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లతో సబ్జెక్ట్‌పై పట్టు సాధిస్తున్నాం. ఇదంతా సీఎం జగన్ మామయ్య చలువే.

– షేక్ ఆలేష్, 8వ తరగతి, తెనాలి.

జనరల్ నాలెడ్జ్ మెరుగు..



ట్యాబ్‌లు పాఠ్యాంశాలు పట్టు సాధించేందుకు దోహదపడుతున్నాయి. మరో వైపు జనరల్ నాలెడ్జ్‌ను కూడా సంపాదించుకునేందుకు ఉపయోగపడుతున్నాయి. సక్రమంగా వినియోగించుకుంటే మంచి మార్కులు సాధించవచ్చు అనే నమ్మకం ఏర్పడింది. – ఎస్.అనూష, 8వ తరగతి, తెనాలి.

క్లుప్తంగా

ఘనంగా కనకదుర్గాదేవి ఆలయ ప్రతిష్టోత్సవం



కొల్లిపర: గుడిబండివారి పాలెంలో కనకదుర్గాదేవి ఆలయ ప్రతిష్ట మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో విచ్చేసి, అమ్మవారికి గాజులు, కుంకుమ, చీర సమర్పించారు. తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి గాజులు, కుంకుమ, పట్టు చీర సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థినులకు అన్నదానం

తెనాలిఅర్బన్: ఆంధ్రప్రదేశ్ నవ చైతన్య బీసీ సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మేడిబోయిన గంగాయాదవ్ ఆధ్వర్యంలో పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహంలోని విద్యార్థినులకు ఆదివారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు, మాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుద్దపల్లి నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గంగాదేవి, వి.భిక్షాలు, జి.సరోజిని, మరియదాసు, పెసర్లంక రమణ, తట్టుకుళ్ళ ఆశోక్ యాదవ్, కరేటి రవి, బచ్చనబోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది చంద్రశేఖర్ మృతి



తెనాలిరూరల్: తెనాలి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది కంచర్ల చంద్రశేఖర్(53) ఆదివారం అనారోగ్యంతో గుంటూరు సమగ్ర వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతదేహాన్ని ఆయన స్వగ్రామం కవేరానికి కుటుంబ సభ్యులు తీసుకువచ్చారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు, కార్యదర్శి గౌరీశంకర్, ఇతర ప్రముఖ న్యాయవాదులు చంద్రశేఖర్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పొలంలో మోటారు చోరీ

తెనాలిరూరల్: పొలంలో విద్యుత్ మోటారు చోరీ గురైంది. ఎస్ఐ పి.కోటేశ్వరరావు వివరాల మేరకు.. పెదరావూరుకు చెందిన కొడాలి రామకృష్ణ తన పొలంలో విద్యుత్ మోటారు ఏర్పాటు చేసుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేయడంతో ఆదివారం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం విక్రేత అరెస్ట్

తెనాలిరూరల్: మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం అరెస్ట్ చేశారు. దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలో అనధికార మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది ఆకస్మిక దాడులు నిర్వహించారు. మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తి నుంచి 13 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

మద్యపానంతో కుటుంబాలు చిన్నాభిన్నం



గుంటూరు ఎడ్యుకేషన్: కుటుంబాలను చిన్నాభిన్నం చేసే మద్యపానాన్ని విడనాడాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి పేర్కొన్నారు. కృష్ణబాబుకాలనీలో కళాశాల ఎన్ఎస్ఎస్–3 విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా విద్యార్థినులు మద్యపానం, ధూమపానం, మత్తు పదార్థాలు, గుట్కా, పొగాకు వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. 21వ డివిజన్ కార్పొరేటర్ కె. గురవయ్య మాట్లాడుతూ మద్యపానం వల్ల కుటుంబాలు ఎంతో నష్టపోతాయని చెప్పారు. కార్యక్రమ నిర్వహణ అధికారి కె. సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ ప్రస్తుతం యువత ఎక్కువగా డ్రగ్స్, మత్తు కలిగించే ఆల్కాహాల్ వంటి దురలవాట్లకు బానిసలుగా మారి, బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 50 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు 76వ సచివాలయం సిబ్బందితో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరుతూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం



తెనాలిఅర్బన్: తెనాలి దంత వైద్యశాల ఆధ్వర్యంలో రామలింగేశ్వరపేటలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ కె.విజయ్ రోగులకు దంత పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దంతాల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

25న హేతువాద అధ్యయన తరగతులు

తెనాలి: ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25న విజయవాడలోని ప్రెస్ క్లబ్‌లో హేతువాద అధ్యయన తరగతులను నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హేతువాద నాస్తిక సాంస్కృతికోద్యమాల అవసరం, జ్యాంగం–పౌరహక్కులు–బాధ్యతలు, నాస్తికత్వం–ఆవశ్యకత, హేతువాదం–శాస్త్రీయత, మానసిక రోగాలు–శాస్త్రీయ వైద్యం, వాస్తు శాస్త్రీయమా? అనే అంశాలపై పౌర హక్కుల సంఘం ముప్పాళ్ల సుబ్బారావు, ముత్తేవి రవీంద్రనాధ్, డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, ప్రొఫెసర్ కొడాలి శ్రీనివాస్ మాట్లాడతారని తెలిపారు. మూఢ నమ్మకాల నిర్మూలనతోనే సమాజం అభివృద్ధి చెందుతుందనే భావనతో ఏర్పాటు చేస్తున్న తరగతులను జయప్రదం చేయాల్సిందిగా తెలిపారు.

భారీ మెజారిటీ లక్ష్యంగా ఎన్నికల్లో ముందుకు

పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే శివకుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న తరుణంలో పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేసే దిశగా స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ 'బ్రేక్‌ఫాస్ట్ విత్ ఎమ్మెల్యే' పేరుతో ఆరంభించిన వార్డులవారీ సమావేశాలు కొనసాగుతున్నాయి. స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని ఏఎస్ఎన్ ఇంజినీరింగ్ కాలేజీలో పట్టణంలోని 13, 23 వార్డుల పరిధిలోని కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, బూత్ లెవెల్ ఏజెంట్లతో ఎమ్మెల్యే శివకుమార్ సమావేశమయ్యారు. అందరి అభిప్రాయాలు, ఆలోచనలను అడిగి తెలుసుకున్నారు. భారీ మెజార్టీ లక్ష్యంగా ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై అందరి అభిప్రాయాలను ఆహ్వానించారు. తన సూచనలను తెలియజేశారు. వార్డు కౌన్సిలర్లు కుర్రా సుజాత, తోక శిరీష, పార్టీ పట్టణ అధ్యక్షులు మద్దాళి శేషాచలం, షేక్ దుబాయ్‌బాబు, తాడిబోయిన రామయ్య, తోక వాసు, మన్నవ ప్రభాకర్, ఎస్.రఘురామిరెడ్డి, కుర్రా శ్రీను, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, షేక్ సుభాని, అక్కిదాసు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీవారి భక్త ఆత్మీయ సమ్మేళనోత్సవం


ప్రవచనం చేస్తున్న త్రిదండి అష్టాక్షరీ రామానుజ జీయర్ స్వామి

తెనాలిటౌన్: కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో గోవింద నామ జపయజ్ఞ పూర్ణాహుతి, వెంకటేశ్వర సప్తాహ వైభోత్సవాలు శ్రీవారి భక్త ఆత్మీయ సమ్మేళనోత్సవం ఆదివారం జరిగింది. భూనీలా సమేత శ్రీనివాసస్వామికి 16రోజుల పండుగ, ఊంజల సేవ, శ్రీనివాస గజపారాయణం, అన్నమాచార్య సంకీర్తనలు, గోవింద నామార్చనలు జరిపారు. మహా మంగళహారతి నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీ త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి (విజయవాడ) విచ్చేసి భక్తులకు ప్రవచనం చేశారు. సాలీగ్రామ మఠం ట్రస్ట్, శ్రీ విద్యాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో బాలస్వామిజీ పర్యవేక్షణలో కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు అన్నామాచార్య సంకీర్తనలు, గోవింద నామార్చనలు అలపించారు. కార్యక్రమంలో టీడీడీ దేవస్థానాల దాసా సాహిత్య ప్రాజెక్టు కృష్ణా గుంటూరు జిల్లాల అధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసరావు, సాలీగ్రామ మంఠం ట్రస్ట్ చైర్మన్ నంబూరి వెంకటకృష్ణమూర్తి, సెక్రటరీ ఉప్పల నాగేశ్వరరావు, కోశాధికారి గోపు రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి ఎం.రమణయ్య, సభ్యులు పాల్గొన్నారు. శ్రీ విద్యాపీఠం సభ్యులు, జయలక్ష్మి మాతృమండలి సభ్యులు, పొత్తూరి ఆదిలక్ష్మి శిష్య బృందం సభ్యులు అలపించిన సంకీర్తనలు విశేషంగా అలరించాయి. ప్రజ్ఞానంద సరస్వతీ బాలస్వామిజీ పర్యవేక్షించారు.

జనం వద్దకే వైద్య శిబిరం

డీ3 శారద సర్వీస్ సొసైటీ వినూత్న సేవ


వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ శారద

తెనాలి: పట్టణానికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ డీ3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మార్కెట్ సెంటర్‌లోని అన్నాబత్తుని సత్యనారాయణ పుర వేదిక వద్ద వైద్య శిబిరం నిర్వహించారు. సంస్థ ధర్మ వాహనం ద్వారా ప్రజలకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ శారద నేతృత్వంలో మొత్తం 150 మందికి ఈసీజీ, షుగర్, బీపీ పరీక్షలు ఉచితంగా చేసి, అవసరమైన వారికి మందులు ఇచ్చారు. రోజువారీ కూలీలు, చిరు వ్యాపారులు, ముఠా కార్మికుల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ.. తమ వంతుగా వారి వద్దకే వచ్చి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మందులు, వైద్య సలహాలతో వ్యాధులు ముదరక ముందే నివారణకు తోడ్పడాలని భావిస్తున్నట్లు తెలిపారు. సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ అనుమతితో సాధారణ ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రదేశాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు పూనుకున్నట్లు చెప్పారు. రైతు బజార్లు, జన సంచారం ఎక్కువగా ఉండే కూడళ్లలో మరో అయిదారు రోజులు వైద్య శిబిరాలు నిర్వహించి, నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ



నగరంపాలెం: ఆదరణ కోల్పోయిన వయో వృద్ధులు, దివ్యాంగులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గిరిధారి మిత్రమండలి అధ్యక్షుడు బవిరిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. కొత్తపేట సోమువారి వీధిలోని మండలి కార్యాలయంలో నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం 30 మంది వృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలి అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ వృద్ధులను ఆదుకునేందుకు దాతలు, సేవా సంస్థలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మండలి కార్యదర్శి పలకలూరి శివరావు, పి.వి.సంజీవరావు, దిండు రాజశేఖర్, వాసవీ క్లబ్ గుంటూరు సిటీ అధ్యక్షుడు మేడ నాగరాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

పెరిగిన అపరాల సాగు

- ఆశాజనకంగా మొక్కజొన్న, జొన్న
- అక్కడక్కడా పంటలకు ఆశించిన తెగుళ్లు
- ప్రస్తుతం ఉన్న దశలోనే నివారణ చర్యలు
- రైతులకు పలు సూచనలు చేసిన ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ రామాంజనేయులు


కొలకలూరులో సాగులో ఉన్న మొక్కజొన్న పైరు


పెసర పంటలో తెగుళ్లను రైతులకు తెలియజేస్తున్న శాస్త్రవేత్తలు (ఫైల్)

తెనాలిటౌన్: ఈ ఏడాది రబీ సీజన్‌లో తెనాలి మండలంలో సాగు చేస్తున్న అపరాల పంటలు ప్రస్తుతం ఆశాజనకంగా ఉన్నాయి. 2,190 ఎకరాల్లో పెసర, 7,334 ఎకరాల్లో జొన్న, 6,050 ఎకరాల్లో మొక్కజొన్న, 63 ఎకరాల్లో మినుము పంటను రైతులు సాగు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో పంటలను తెగుళ్లు ఆశించాయి. వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఆత్మ ప్రాజెక్ట్ అధికారులు ఇటీవల మండల గ్రామాల్లో పర్యటించారు. హాఫ్‌పేటలో పెసర, ఖాజీపేటలో జొన్న, కొలకలూరులో మొక్కజొన్న, నందివెలుగులో మినుము పంటలను పరిశీలించారు. తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా రైతుల అభ్యున్నతికి చేస్తున్న కృషిని వివరించారు.

మినుము, పెసర పంటలు

ఈ పంటలు 35 నుంచి 40 రోజుల దశలో ఉన్నాయి. ఆకుముడత, బొబ్బర లాంటి వైరస్ తెగుళ్లు ఆశించాయి. ఈ తెగుళ్లను వ్యాప్తి చేసే రసం పీల్చే పురుగుల నివారణకు చేపట్టాల్సిన చర్యలు, పిచికారీ చేయాల్సిన మందులను, తెగుళ్ల ఉధృతిని రైతులకు అధికారులు వివరించారు.

నివారణ చర్యలు

- తెగులు ఉధృతి, అవసరాన్ని బట్టి మందులు పిచికారీ చేయాలి.
- 10–15 రోజుల వ్యవధిలో మందు పిచికారీ చేసుకోవాలి.
- ప్రొపినోఫోజ్ 400 మి.లీ. లేక ఫ్రిప్రొనిల్ 300 మి.లీ.లేక స్పైనోసాడ్ 60 మి.లీ. ఒక ఎకరం పైరులో పిచికారీ చేయాలి. ఎస్సెట్ 200 గ్రాములు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

జొన్న పైరు

ఈ పైరు 40–45 రోజుల దశలో ఉంది. పైరులో గులాబీ రంగు, మచ్చల కాండం తొలుసు పురుగు వ్యాప్తి ఉంది. పురుగు ఉనికిని, ఉధృతిని గమనించి రైతులు మందులను పిచికారీ చేయాలి. పేనుబంక ఉధృతి ఉంది.

నివారణ చర్యలు

- కారజిన్ 60 మి.లీ. మందు ఎకరం పైరులో పిచికారీ చేయాలి.
- ఫ్లో బెండమైర్ (ఫైమ్) 40 గ్రాములు లేక బెంజోయేట్ 80 గ్రాములు, సైనోసాడ్ 60 మి.లీ. లేక సైనెటోరాయ్ 100 మి.లీ. మందును ఎకరం పైరులో లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- రెండుమూడు రకాల పురుగు మందులు కలిపి వాడరాదు.
- మందు ద్రావణం పైరు అంతా కమ్ముకునే విధంగా పిచికారీ చేసుకోవాలి.
- పేనుబంక తెగులు నివారణకు రోగార్ 400 మి.లీ లేక ఎస్సెట్ 300 గ్రాములు లేక ఇమిడాక్లోఫిడ్ 50 మి.లీ లేక ఎసీటా మీ ఫ్రైడ్ 40 గ్రాములు లేక థైయోమిథాక్సామ్ 40 గ్రాములు మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

మొక్క జొన్న పైరు

ఈ పైరు 45–50 రోజుల దశలో ఉంది. పైరులో కత్తెర పురుగు ఉనికిని, ఉధృతిని గమనించారు. పురుగు ఉధృతిని బట్టి 10–15 రోజుల వ్యవధిలో మందులు పిచికారీ చేయాలి. అక్కడక్కడా బ్యాక్టీరియా కాండం కుళ్లు తెగులు గమనించారు. ఇది కుళ్లిన కాండం పీచు చూసినప్పుడు చెడు వాసన వస్తుంది. పొలంలో అక్కడక్కడా గుంపులుగా ఈ తెగులు సోకుతుంది.

సరైన సమయంలో నివారణ చర్యలు చేపట్టాలి



రబీలో సాగు చేస్తున్న జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర పంటల సాగులు ఆశాజనకంగా ఉన్నప్పటికీ కొన్ని గ్రామాల్లో అక్కడక్కడ తెగుళ్లు ఆశించాయి. తెగుళ్ల ఉధృతిని బట్టి వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సలహాలతో సరైన సమయంలో పైరులో మందులు పిచికారీ చేయాలి. నివారణ చర్యలు చేపట్టినట్లయితే పైరు పెరుగుదలకు ఇబ్బంది ఉండదు. రైతులకు నష్టం జరిగే అవకాశం ఉండదు. శాస్త్రవేత్తలు, అధికారులు గ్రామాల్లో పంటలను పరిశీలించి రైతులకు పలు సలహాలు, సూచనలు అందజేస్తున్నారు.

– పి.రామాంజనేయులు, ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్, గుంటూరు

నివారణ చర్యలు

- కత్తెర పురుగు నివారణకు ఇమామ్ మిథీన్ చెంబోయట్ 80 గ్రాములు లేక కోరానిల్ ఫ్లోర్ 80 మి.లీ లేక స్పెన్‌సాడ్ 60 మి.లీ లేక స్పైనీ టోరమ్ 100మి.లీ మందును లీటర్ నీటిలో కలిపి ఎకరం పైరులో పిచికారీ చేయాలి.
- బ్యాక్టీరియా కాండం కుళ్లు నివారణకు బ్లీచింగ్ పౌడి 10 గ్రాములు లీటర్ నీటిలో కలిపి తెగుళ్లు సోకిన మొక్కలు, వాటి చుట్టు పక్కల మొక్కలకు మొదలలో నేల తడిచే విధంగా పోయాలి.

జాతీయ పోటీల్లో మోహన రూపకు కాంస్యం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): కేరళలోని కోజికోడ్‌లో ఈ నెల 16 నుంచి 18 వరకు జరిగిన సీనియర్ నేషనల్స్ ట్రాంపోలిన్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో గుంటూరుకు చెందిన మోహన రూపకు కాంస్య పతకం దక్కిందని కోచ్ పఠాన్ అఫ్రోజ్ ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బీఆర్ స్టేడియంలోని జిమ్నాస్టిక్స్ సెంటర్లో శిక్షణ పొందిందని పేర్కొన్నారు. మోహన రూప ఇప్పటి వరకు తొమ్మిది నేషనల్స్‌లో ఆడి ఉత్తమ ప్రతిభతో పాటు పలు పతకాలు సాధించిందని తెలియజేశారు.

అవోపా ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని ఆర్య వైశ్య అఫీషియల్స్–ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) కార్యాలయంలో ఆదివారం 108 మంది పేదలు, వృద్ధులకు రూ.500 చొప్పున పెన్షన్ పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ కాటన్ వ్యాపారి చందోలు శివరామకృష్ణ ప్రసాద్, హెల్దీ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు మాజేటి రామారావు మాట్లాడుతూ పేదలకు ప్రతి నెలా పెన్షన్లతో పాటు నూతన వస్త్రాలను అందజేయడం మంచి పరిణామమని అన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. అవోపా ద్వారా పేదలను ఆదుకునేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వంకాయల జనార్ధనరావు, అవోపా రాష్ట్ర కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, నగర అధ్యక్షుడు కె.వి.బ్రహ్మం, కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, మద్దిసాయి రమేష్, వివాహ వేదిక కన్వీనర్ కంచర్ల వెంకటేశ్వర్లు, రాచపూడి సుబ్బారావు కోటిరత్నం పాల్గొన్నారు.